# నరాల స్వరాలు

"ఇల్లు ముంగిలీ లేని మిల్లు గుమాస్తాకు పిల్లనిస్తున్నా. నా బిడ్డ అదృష్టమెట్లా ఉంటుందో! నమ్మి నీ చేతుల్లో పెడ్తున్నానల్లుడూ! మంచిగ చూస్కుంటవు గదూ!"

తన పెళ్ళిలో అప్పగింతలప్పుడు స్రవంతి తండ్రి... చిప్పిల్లిన కళ్ళను కండువాతో ఒత్తుకుంటూ అన్న మాటలు గుర్తొచ్చినప్పుడల్లా మల్లికార్జున్‌కి కడుపులో చల్లజేసినట్టవుతుంది. మావయ్య నమ్మకాన్ని వమ్ము చేయొద్దనే పట్టుదలతో భార్య మీద ఈగవాలకుండా చూసుకోవాలనుకున్నాడు. మిల్లు పనిమీద నెల్లూరెళ్ళి నిన్ననే తిరిగొచ్చాడు. ఐదొందల కిలోమీటర్ల అవతల లారీ బర్తీ నింపించి ముందు సీట్లో కూచున్నాడు. రాత్రి పగలునేకం చేసి డ్రైవర్ పక్కన ప్రయాణించాడు. మిల్లుకు వచ్చేసరికి రాత్రి పది దాటింది. భార్యా, పిల్లల రూపం బుర్రలో గిర్రుమంటూంటే బస్తాలు మిల్లులో వేయించి అంగలారుస్తూ ఇంటికొచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. ముక్కుపచ్చలారని మూడేళ్ళ కూతురు అశ్విని హాయిగా నిద్రబోతోంది. పాప మొహం కడిగిన ముత్యంలాగుంది.

అలసట ఆవులించింది. గ్లాసుడు నీళ్ళు గటగటా తాగేసి ఊపిరి పీల్చుకున్నాడు.

"భోజనమైందా?" స్రవంతి అడిగింది ఆవులింతనాపుకుంటూ.

"అర్ధరాత్రి దాటింది గదా!"

ఒకపూట భోజనం బాపతు డబ్బు మిగిలింది. ఆ తృప్తే కడుపు నింపింది. మిల్లు ..నిమీద టూరులో ఉంటే రోజుకు యాభై రూపాయలు తిండిఖర్చుకిస్తారు. ఆకలికి ఎంత ఓర్చుకుంటే అంత ఆదా. ఉదయం చాయ్, మధ్యాహ్నం ప్లేటు భోజనం, రాత్రికి బన్నుతో సరిపెట్టుకోవడం అలవాటైంది. లేకపోతే గొర్రెతోక జీతం సరిపోతుందా! రెండు చిన్నగదుల పోర్షను... నెల అద్దె ఆరొందల రూపాయలు. నల్లా, కరెంటు వగైరాలు అదనం. పాపకు పాలడబ్బా కొనాలి. ఊళ్ళో ఉన్న ముసలి తల్లికి నెలకో మూడొందలు పంపాలి. పుట్టమీది పూవు తప్పినా ఇవి తప్పవు... మంచమ్మీద ఒరగగానే నిద్రాదేవి ఒడిలోకి లాక్కుంది.

పాలవాడి పిలుపు ఫ్యాక్టరీ సైరన్‌లా వినబడింది. స్రవంతి పాలు లోపల పెట్టి వచ్చేసరికి లేచి మంచానికి కాళ్ళు వేళ్లాడేసి కూచున్నాడు.

"ఇవాళ ఐదో తారీకు గదా! పాలాయన పైసలడుగుతున్నడు" లోగొంతుకతో గుర్తుచేస్తూ పక్కన కూచుంది.

తూర్పు వైపున్న పెరటి కిటికీలోంచి... అరుణవర్ణం పులుముకున్న ఆకాశం చైతన్యకేతన మెగరేస్తోంది. బాధలు, బాదరబందీలు గుర్తుకురాకుండా జాగ్రత్తపడుతూ భార్య చెయ్యందుకున్నాడు.

"నీ మొకం పున్నమి చందమామలాగుంది సుమా!" చిలిపిగా చెంపగిల్లాడు. ఎదలోని గిలిగింతలు పెదాలమీది చిరునవ్వులై స్రవంతి బుగ్గలమీద సిగ్గులు సింగారించినై.

"ఇందుకేనా పొద్దుపొడవక ముందే లేచికూచుంది!" చెట్టు మీంచి రాలిన పూవులా ఒడిలో వాలిపోయింది. "నిద్ర అయిపోయిందా?"

"నిద్రదేముందిలే! తర్వాత..."

"ఇంటి ఓనరు కిరాయి డబ్బులడుగుతున్నడు..."

"అబ్బా ఇద్దాంలే... జీతం రావాలిగదా!" మరో చెంపగిల్లాడు. "అయినా పానకంలో పుడకలాగా అవన్నీ ఇప్పుడే గుర్తుకు వస్తున్నయ్యా?" కితకితలు పెట్టాడు. కిలకిలా నవ్వింది. నవ్వులో గోదావరి ప్రవాహధ్వని ఉంది.

సెల్‌ఫోన్ గణగణా మోగింది.

మిల్లు వాళ్ళ సౌకర్యం కోసం తన దగ్గరున్న వాళ్ళ సెల్‌ఫోన్ అది. "ప్చ్... పాడు ఫోను..." ఉసూరుమంటూ విడిపోయింది స్రవంతి.

"హలో... నేనే... మల్లికార్జున్‌ని"

"ఆ... ఆ... రాత్రికి బస్తాలు దింపి గోదాము తాళాలు మా ఇంట్లో అప్పజెప్పినవు గదూ!"

"అవును సేటూ. అప్పజెప్పిన".

"సరేగాని... నువు తొందరగా తయారై మిల్లుకుపోవాలె. లారీ లోడవుతోంది. లారీతోని గుంటూరుకు పోవాలె. సరుకుదించి పద్దులు వసూలు చేసుకు రావాలె."

చేతులున్న బందరులడ్డు మూతిదాకా రాకుండా జారిపోయినట్టయింది. "నిన్న అర్ధరాత్రయింది సేటూ! అలసటగా ఉంది గదా!"

"నీకు ఉద్యోగమిచ్చేటప్పుడే చెప్పిన గదా మిల్లుపని ఇట్లుంటదని. లేకపోతే నెలకు రెండువేలెట్లా ఇస్తరూ?"

"తప్పదా సేటూ?"

"తప్పదు. తొందరగా వెళ్ళు. గుంటూరు నుంచి రాంగానే జీతం దీస్కో! నేను వేరే పనిమీదున్న". ఫోన్ కట్. ఉత్సాహం హుష్కాకైంది.

ప్చ్... డొక్కాడాలంటే రెక్కాడి తీరాలి... ఒళ్ళు విరుస్తూ లేచినుంచున్నాడు.

ఇవ్వాళ జీతం రాదన్నమాట. గుమాస్తాగాడంటే గొడ్డు చాకిరీ గాడిదన్నమాట. బరువు బాధ్యతలేగాని హక్కుల్లేవు. డ్యూటీకి టైముల్లేవు. కష్టం గుమాస్తాలది, కాసులు సేట్లవి. శ్రమదోపిడి ఇలా సాగిపోవాల్సిందేనా?... ఏం చేద్దాం! పేదోడి రోషం పెదవికి చేటు. గుమాస్తా ఆవేశం అవస్తలకే దారితీస్తుంది. మిల్లులో హమాలీలకు యూనియనుంది. హాయిగున్నరు. మిల్లుగుమాస్తాలు గూడా ఏకమై యూనియన్ పెట్టుకుంటే బాగుంటుంది.

స్రవంతి స్నానం చేసొచ్చింది. ముతకచీరలో ముద్దబంతిలాగుంది. శూన్యంలోకి చూస్తున్న భర్త భుజమ్మీద చెయ్యేసి "గదేందీ, గట్లా చూస్తున్నవ్? లే... తొందరగా స్నానం చెయ్. చాయ్ చేసిస్తా" చిరునవ్వుతో మొహంలోకి సూటిగా చూసింది. ఒంటిరాయి ముక్కపుడక తళతళా మెరుస్తోంది.

"ఏం లేదు స్రవంతీ! గొర్రెతోక జీతంతోని ఏమి సాధించగలమని ఆలోచిస్తున్నా" గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు.

"గొర్రెతోకనో, బర్రెతోకనో! బీరగింజోలె బీరిపోతే కడుపుల కొస్తదా? రెక్కాడితేనే గదా డొక్కాడేది" చెంపలు నిమిరి లేపి నుంచోబెట్టింది. తాను లోపలి కెళ్ళిపోయింది.

ఇల్లిల్లూ ప్రచారం చేసినా ఎన్నికల్లో డిపాజిట్ దక్కించుకోలేని అభ్యర్థిలా నిరాశగా కదిలాడు. గబగబా తయారై బన్ను చాయ్‌లో నంజుకు తింటున్నాడు.

"మీ చెల్లెలి కిప్పుడు ఎనిమిదో నెల. మొదటి కాన్పు మనమే చేయించాలి గదా!" గుర్తుచేసింది స్రవంతి. గుండె గుబగుబలాడింది.

కంప్యూటర్ల యుగంలో గూడా నాలాంటి వాని కష్టం బతుకు యథాతథమేనాయె. మిల్లుకెళ్ళేముందు గుర్తుకొచ్చింది కూతురు.

"అశ్విని ఇంకా లేవలేదెందుకో!" మంచం దగ్గరికెళ్ళాడు. పాప సన్నగా మూల్గుతోంది. నుదుటి మీద చెయ్యేశాడు. వేడిగా ఉంది.

"అరెరే! పాపకు జ్వరమొచ్చింది స్రవంతీ!"

గాబరాగా పరుగుత్తుకొచ్చి పాపనెత్తుకుంది. "ఇది రేకులషెడ్డు గదా! వడదెబ్బ కావచ్చు" ఒళ్ళంతా పుణికి గుండెలకు హత్తుకుంది. "మరిప్పుడెట్లా?" గుబులుతో మొహం ప్రశ్నార్థకమైంది.

"ఎండాకాలం గదా! దవాఖానల చూపించాలె" అని సెల్‌ఫోన్ అందుకున్నాడు.

"హలో సేటూ! మా పాపకు వడదెబ్బ జ్వరమొచ్చింది. దవాఖానల చూపించాలె..." మాట పూర్తికాలేదు.

"అదంతా నీ భార్యకప్పజెప్పి నువు త్వరగా బయలుదేరు. లారీ లోడైందంటా. మిల్లునుంచి ఫోన్‌మీద ఫోనొస్తుంది" ఫోన్ కట్.

"ఛీఛీ... గతిలేని నౌకరి" గొణుక్కున్నాడు. విసుక్కున్నాడు.

"పాప నుదుటిమీద తడిగుడ్డ వెయ్. అప్పటి వరకు తగ్గకుంటే సర్కారు దవాఖానల చూపించు" అంటూ బయటికొచ్చాడు. సైకిలెక్కి బయలుదేరాడు.

తన బతుకులాగే సైకిల్ అడ్డదిడ్డంగా తయారైంది. ఎన్నిసార్లు రిపేరు చేయించినా అంతే. స్రవంతి చూపుల్లోని దైన్యం, అశ్విని అవస్త... బుర్రలో గిర్రుమంటూంటే సైకిల్ రోడ్డుమీద పరుగెడుతోంది.

ఇంటి కిరాయి, పాలపైసల కోసం స్రవంతి ఎంత బాధపడుతుందో! కిరాణాషాపు బాకీ ఎంతయిందో! అశ్వినికి జ్వరమెట్టుంటదో! చెల్లెలికి కాన్పు చేయించాలంటే మాటలా? మళ్ళీ అప్పుకోసం ఎవరి నడగాలో! ఆ తర్వాత ఎట్లా తీర్చాలో! అట్టడుగు వర్గాల బాగుకోసం సర్కారోల్లు ఏవేవో స్కీములు తెస్తున్నా నాలాంటి వాడందుకోలేక పోతున్నాడు.

"అమ్మా!" అరుపుతో రోడ్డు దద్దరిల్లింది. రోడ్డుపక్కనున్న ఆటోని గుద్దుకుంది సైకిల్. అమాంతం అటుపక్క పడిపోయాడు.

చుట్టూ జనాలు మూగారు. నలుగురు కలిసి లేపి నుంచో బెట్టారు. సైకిల్‌కు స్టాండు వేసారు. ఓ ముసలాయన ఒళ్ళంతా పుణుకుతూ "దెబ్బదాకిందా బిడ్డా?" ఆప్యాయంగా అడిగాడు. లేదని తలూపాడు. గీరుకుపోయిన మోచేతిని చేతిగుడ్డతో అద్దుకున్నాడు.

ఆటో (ఓనరు) వాలా "ఓర్నియవ్వ గదేందన్నా? పొద్దుగాల్ల లేవంగనే పాచికల్లు దాగినవా?" ముసిముసిగా నవ్వుకుంటూ ఆటోను తుడుచుకుంటున్నాడు.

"కాదన్నా, సైకిల్‌కు బ్రేకులు సరిగాలేవు" సిగ్గుతో తల వంగిపోయింది. చేతిలో కూరగాయల సంచీతో ముందుకొచ్చిన ఓ ముసలామె "పొద్దుగాల్ల లేవంగానే మంచిమొకం జూచినవు బిడ్డా! ఇదే నడిరోడ్డుమీదైతే దేంజరయేది" బుగ్గలు నొక్కుకుంది.

"పో అన్నా... ఇక పో.." ఆటోవాలా ఆటోతో వెళ్ళిపోయాడు.

"ఇంకానయం. మిల్లు సైకిలేమీ ఖరాబు కాలేదు. అయితే సొంత పైసల్తోని రిపేరు చేయించాల్సి వచ్చేది" గొణుక్కుంటూ సైకిలెక్కాడు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మిల్లు చేరుకున్నాడు.

మంత్రిగారి కోసం ఎదురుచూస్తున్న ఛోటా లీడర్లా పెద్దగుమాస్తా ఎదురొచ్చాడు. "ఏంది మల్లికార్జునా! ఇంత ఆలస్యమా? ఎండాకాలం చల్లపూట తొందరగా బయలుదేరితే మంచిది గదా!" ఆప్యాయంగా విసుక్కున్నాడు.

విషయమంతా చెప్పేసి చివరికి "గిట్లా బతికేకంటే చచ్చిందే నయమన్నా!" నెత్తికొట్టుకున్నాడు.

"గట్లంటే ఎట్ల తమ్మీ! నన్ను జూడు. ముప్పయ్యేండ్ల నుండి మూన్నాళ్లు మిల్లులల్ల పంజేసిన. ఏం లాభం? ఇంకా బట్ట- పొట్టకు తిప్పలు తప్పదాయె. పెట్టుబడి పెట్టి నీడకున్నోళ్ళు కోటీశ్వరులైరి. మనసొంటి కష్టజీవులు దినదిన గండం నూరేళ్లాయుష్షు లెక్క గడుపుతున్నరు. నువ్వు నిన్న నింపుకొచ్చిన బర్తీ లారీల మన సేటుకు ఖర్చులు పోను ఐదువేల రూపాయల లాభముంది. నువ్వేమో సగం కడుపు మాడ్చుకొంటివి." సానుభూతి వెలిబుచ్చి ఖర్చులకు డబ్బులిచ్చాడు.

మల్లికార్జున్ లారీ ఎక్కేశాడు. అతుకుల బతుకుల ఆరాటం గురించి డ్రైవర్తో మాటామంతికి దిగాడు. రెండొందల కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. మిట మధ్యాహ్నమైంది. నడుమంత్రపు గల్లీ లీడర్లా ఎండ చిటపటలాడ్తోంది. కడుపులో ఎలుకలు పరుగులు... ఆకలి కేకలు. లారీ దాబా హోటల్ ముందాగింది. లారీ దిగి హోటల్లోకెల్తున్నాడు. వేడెక్కిన తార్రోడ్డు... చిల్లులుపడ్డ హవాయ్ చెప్పులు... అరికాళ్ళు చురుక్కు చురుక్కు... కాళ్ళమంట నశాలాని కంటింది. పరుగులాంటి నడకతో దాబాలో దూరాడు. డ్రైవర్ చెమట అద్దుకుంటూ వచ్చి ఎదురుగా కూచున్నాడు. ఇద్దరి మధ్య టేబులుంది. దాబా నిండా జనాలున్నారు. భోజనానికి ఆర్డరిద్దామనుకుంటూంటే సెల్ఫోన్ మోగింది.

"హలో... ఏంది స్రవంతీ? ఇంకా గుంటూరు చేరుకోలేదు. పబ్లిక్ ఫోన్నుంచా? అశ్వనికెట్లుందీ?"

"జ్వరం ఎక్కువైంది దానికి. నాకు భయమైతంది. అదేమో నాన్నా, నాన్నా అంటూ కలవరిస్తోంది..." గొంతులో వణుకు.

కాళ్ళు కడుపులో చొచ్చినట్లైంది. వెన్నులో సన్నని వణుకు. కాని ధైర్యంగా ఉండాల్సిందిప్పుడే. లోపలి అల్లకల్లోలం సవ్వడి గొంతులోకి రానివ్వకుండా ఆపేసి "భయమెందుకూ, సర్కారు దవాఖాన..."

"తీస్కపోయ్యి చూపించానండీ! అక్కడ డాక్టర్లు లేరు. కాంపౌండర్ ఏవో మాత్రలిచ్చిండు....లాభం లేదు".

"అయితే ప్రైవేటు డాక్టర్‌కు చూపించు".

"పైసలు కావాలెగదా! మీ చెల్లెలు సీమంతానికే నా చెవుల కమ్మలు కుదువ బెట్టిమిగదా! ఇంకా విడిపించకపోతిమి..."

"నిజమే. వాటిని అదే మార్వడి సేటు కమ్మేసెయ్. బాకీపోగా మిగిలిన దబ్బులీసుకో..."

"అయ్యో! అవి మా అమ్మ చనిపోయేటప్పుడు నాకిచ్చింది...." ఏడుస్తున్న శబ్దం.

కడుపులో పేగు కదిలింది. "అబ్బే అవన్నీ అనుకుంటే కుదుర్తదా? ముందు మన పాప జ్వరం తగ్గాలిగదా!" పైకి బుజ్జగింపు లోపల బడబానలం.

"సరే... మంచిది" ఫోన్ పెట్టేసింది.

మొహం ముడుచుకుపోయింది.

"ఏందన్నా... ఇంటినుంచా?" డ్రైవరడిగాడు.

"అవునన్నా...!" పూసగుచ్చినట్టు చెప్పాడు.

"మన బతుకులు గంతేనన్నా!" అంతా విని డ్రైవర్ పెదాలు చప్పరించాడు. "మన సంసార సాగరంల అడుగడుగునా సుడిగుండాలే. మనలాంటి కార్మికులకు యూనియనే లేదు. మనకు సుతిలేదు. గందుకే గతిలేదు".

నిజమే. అందుకు ఎవరో ఒకరు పూనుకోవాలి, ఎవరి కోసమో ఎదురు చూపులు ఎంతకాలం? తానే ముందుకు రావాలి... మా గుమాస్తాలందర్నీ సంప్రదిస్తా... తిరగబడితే... న్యాయం కోసం పోరాడితే పోయేదేముంది, బానిస సంకెళ్ళు తప్ప... ఆలోచిస్తూ అన్నానికి ఆర్డరిచ్చాడు.

నిర్ణయం నరాల స్వరాలను మార్చేసింది.

(కార్మికలోకం – పత్రిక కథల పోటీలో బహుమతి పొందినది)